
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
మంగళవారం 28 అక్టోబరు 2025



# కార్తీక శోభ

తొలి కార్తీక సోమవారం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని ఉమా పార్థీవ కోటి లింగేశ్వర ఆలయంలో మహిళలు, యువతులు కార్తీక దీపాలను వెలిగించారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)





# లక్కు.. కిక్కు!

- ఉత్కంఠగా సాగిన మద్యం దుకాణాల లక్కీడ్రా
- 93 షాపులకు డ్రా తీసిన కలెక్టర్ హైమావతి
- 20 దుకాణాలను దక్కించుకున్న మహిళలు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 93 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం నిర్వహించిన లక్కీ డ్రా సోమవారం సిద్దిపేటలోని సీసీ గార్డెన్‌లో ఉత్కంఠభరితంగా సాగింది. ఈసారి జిల్లాలో ఉన్న 93 మద్యం దుకాణాలకు ఏకంగా 2,782 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ హైమావతి ఉదయం 11 గంటలకు డ్రా ప్రారంభించారు. మొదటి డ్రా సిద్దిపేట అర్బన్ మండలం షాప్ నెంబర్ 1ను తీయగా ప్రశాంత్ రెడ్డి దక్కించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిండికేట్‌లుగా దరఖాస్తు చేసుకున్న వ్యాపారవేత్తలు, ఆశావాహులు పెద్ద సంఖ్యలో ఫంక్షన్‌హాల్‌కు చేరుకున్నారు. పారదర్శకత కోసం ఫంక్షన్ హాలు లోపలికి కేవలం దరఖాస్తు చేసుకున్న వారిని మాత్రమే అనుమతించారు. సెల్‌ఫోన్లను సైతం లోనికి అనుమతించలేదు. లక్కీ డ్రాను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డివిజన్ల వారీగా వ్యాపారవేత్తలను లోనికి పంపించి డ్రా తీశారు. మిగతా వ్యాపారవేత్తలు డ్రాను చూసేందుకు ఫంక్షన్ హాలు బయట స్ర్కీన్లను ఏర్పాటు చేశారు. షాప్ నంబర్ 1 నుంచి 93 వరకు అన్ని డ్రాలను కలెక్టర్ హైమావతి స్వయంగా తీశారు.

## వెనుకాడని సిండికేట్‌లు

అన్ని వర్గాలకు చెందిన వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఆశావాహులు మద్యం షాపులను దక్కించుకోవాలనే ఉద్దేశంతో ఈసారి దరఖాస్తు రుసుము పెంచినప్పటికీ వెనుకంజ వేయలేదు. పది నుండి పదిహేను మంది కలిసి సిండికేట్‌గా ఏర్పడి దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. షాపులు దక్కించుకున్న యజమానులు ఆనందంతో ఎగిరి గంతులేయగా, దక్కని వారు నిరాశతో వెనుదిరిగారు.



డ్రా తీసి చూపిస్తున్న కలెక్టర్ హైమావతి

## అధిక దరఖాస్తులు వచ్చిన షాపులు ఇవే

జిల్లాలో అత్యధికంగా దరఖాస్తులు వచ్చిన మద్యం దుకాణాలలో కొండపోచమ్మ దేవాలయం వద్ద ఉన్న తిగుల్ నర్సాపూర్ షాప్ నెంబర్ 51కి ఏకంగా 73దరఖాస్తులు వచ్చాయి. ఈ షాపును బి. వెంకటేష్ గౌడ్ దక్కించుకున్నారు. తిగుల్ నర్సాపూర్‌కు చెందిన మరో షాప్ నెంబర్ 50కి 63 దరఖాస్తులు రాగా ఉడుత దేవయ్య దక్కించుకున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం నర్సాపూర్ చౌరస్తా షాప్ నెంబర్ 5కు 51 దరఖాస్తులు రాగా సత్తమ్మ దక్కించుకుంది. వంటిమామిడి షాప్ నెంబర్ 45కు 52 దరఖాస్తులు రాగా ఉప్పరి శ్రీకాంత్ దక్కించుకున్నారు. కొమురవెల్లి షాప్ నెంబర్ 82కు 43 దరఖాస్తులు రాగా జాలిగామ సాయి కిరణ్ దక్కించుకున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి షాప్ నెంబర్ 2కు 40 దరఖాస్తులు రాగా పింగళి మనివిత్ రెడ్డి దక్కించుకున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మెదక్ రోడ్ షాప్ నెంబర్ 10కి 35 దరఖాస్తులు రాగా తొడుపునురి వినీత్ కుమార్ దక్కించుకున్నారు. సిద్దిపేట అర్బన్ గంగాజల్ చౌరస్తా షాప్ నెంబర్ 7కు 31 దరఖాస్తులు రాగా పన్యాల సరిత దక్కించుకుంది.

## 20 దుకాణాలు మహిళల వశం

కొంత మంది వ్యాపారవేత్తలు సెంటిమెంట్ కోసం మహిళల పేరిట దరఖాస్తు చేసుకున్నారు.

మిగతా 8వ పేజీలో



ఫంక్షన్‌హాల్ బయట వ్యాపారవేత్తల సందడి

'సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన ఎల్లయ్య రెండెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పండిన మక్కలను సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌కు తీసుకురాగా అధికారుల సమాధానం విని నివ్వెరబోయాడు. ఇక్కడ విక్రయించాలంటే ఎవరి పేరిటైతే భూమి ఉందో వారు వేలిముద్ర పెడితేనే బార్‌దాన్ సంచులు ఇస్తామని చెప్పారు. ఆ భూమి తన తండ్రి భూమయ్య పేరిట ఉందని, ఆయన మూడేళ్ల క్రితమే చనిపోయాడని చెప్పినా ససేమిరా అన్నారు.'

'తొగుట మండలం మెట్టు గ్రామానికి చెందిన గందె నర్సింహులు దాదాపు 100 క్వింటాళ్ల మక్కలను సిద్దిపేట మార్కెట్‌కు తెచ్చాడు. బార్‌దాన్ సంచులు కావాలని అడగగా భూమి యజమాని రావాలన్నారట. సదరు యజమాని అమెరికాలో ఉంటున్నారు. ఆయన భూమిని తాను కౌలుకు చేస్తున్నానని నర్సింహులు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.'

'సిద్దిపేట రూరల్ మండలం రావురూకులకు చెందిన రాజు అనే రైతు ఎకరం భూమిలో 35 క్వింటాళ్లు పండించి మార్కెట్‌కు తెచ్చాడు. అయితే ఎకరంలో పద్దెనిమిదిన్నర క్వింటాళ్లు మాత్రమే తీసుకోవాలని, అంతకుమించి తాము తీసుకోలేమని మార్కెటింగ్ అధికారులు చెప్పడంతో ఆశ్చర్యపోయాడు. మిగితా మక్కలను ఎక్కడ విక్రయించాలో అర్థమవ్వక దిగాలు చెందుతున్నాడు.'

# మక్క... తిక్క

- మార్క్‌ఫెడ్ మార్గదర్శకాలపై మొక్కజొన్న రైతుల మండిపాటు
- చనిపోయినా, విదేశాల్లో ఉన్నా వేలిముద్ర కోసం రావాల్సిందే!
- ఎవరి పేరిట భూమి ఉంటే వాళ్లే మక్కలు విక్రయించాలి
- ఎకరంలో 18.50 క్వింటాళ్లు మాత్రమే పండించాలి
- ఎక్కువ పండితే కొనేదిలేదంటున్న పరిస్థితి
- అశాస్త్రీయ విధానాలతో ఆగమవుతున్న రైతులు

సిద్దిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొక్కజొన్న సాగుచేసిన రైతుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ఆరుగాలం శ్రమించి పండించిన మక్కలను విక్రయించడానికి వ్యవసాయ మార్కెట్లకు తీసుకొస్తున్న అన్నదాతలకు మార్క్‌ఫెడ్ నిర్ణయాలు అశనిపాతంలా మారాయి. రూ.2400 మద్దతు ధర దక్కాలంటే మార్క్‌ఫెడ్ మార్గదర్శకాలను పాటించాలి లేదంటే క్వింటాల్‌కు రూ.1800 చొప్పున ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాల్సిందే. మార్క్‌ఫెడ్ నిర్ణయాలపై సోమవారం పలువురు రైతులు 'ఆంధ్రజ్యోతి'తో తమ బాధలు పంచుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ వేడుకున్నారు.

మిగతా 6వ పేజీలో



సిద్దిపేట మార్కెట్‌లో మక్కలు



రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ

# పటిష్ట నిఘా

- సిద్దిపేటను గంజాయిరహితంగా తీర్చిదిద్దుతాం
- సీపీ విజయ్ కుమార్

గజ్వేల్/రాయపోల్/దౌల్తాబాద్/తొగుట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్ఎం విజయ్‌కుమార్ సోమవారం గజ్వేల్ మండల పరిధిలోని మక్తమాసాన్‌పల్లిలోని బేగంపేట, అలాగే దౌల్తాబాద్, రాయపోల్, తొగుట పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు, సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. సిద్దిపేట కమిషనరేట్‌ను గంజాయిరహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జూదం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై కూడా నిఘా ఉంచి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇసుక, మట్టి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసే వాహనదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాతనేరస్థులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజల రక్షణ ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సీపీ సూచించారు. గ్రామాలకు సంబంధించిన వీపీవోలు రెండు, మూడు రోజులకు ఒకసారి గ్రామాలను సందర్శించి, ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మల్లన్నసాగర్ రిజర్వాయర్, టెన్నెల్‌ను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింహులు, తొగుట సీఐ ఎస్కే లతీఫ్, బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్, రాయపోల్ ఎస్ఐ మానస, తొగుట ఎస్ఐ రవికాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.





# సదర్ సయ్యాట

- వేడుకల్లో పాల్గొన్న హన్మంతరావు..
- డ్యాన్స్ చేసిన మైనంపల్లి రోహిత్

సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి సదర్ సందడిగా సాగింది. 43వ వార్డు కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్, పయ్యావుల సందీప్ యాదవ్ సిద్దిపేట సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. హర్యానా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 6 దున్నల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ దున్నల మీదకు ఎక్కి డ్యాన్స్‌లు చేశారు. యువకులతో కలిసి స్టెప్పులేసి వారిలో ఉత్సాహం నింపారు.

- సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)



మర్పడగ క్షేత్రం..

## వార్షిక వైభవం

- నేటి నుంచి విజయదుర్గామాత ఆలయంలో ఉత్సవాలు
- అమ్మవారికి స్వర్ణ కిరీటం సమర్పణ
- భక్తుల నుంచి సేకరించిన రూ.2 కోట్ల విరాళాలతో తయారీ

దళారులను నమ్మి

## మోసపోవద్దు

- మోదీ హయాంలో గణనీయంగా పెరిగిన పత్తి మద్దతు ధర
- ఎంపీ రఘునందన్‌రావు

వార్తలు 7లో..

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మరో రూ.141.34 కోట్లు

- గత ప్రభుత్వంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- కొత్త కాలనీలకు, విలీన గ్రామాల ప్రజలకు తీరనున్న సమస్యలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణ వందేళ్ల పునాదిగా నిర్మించుకుంటున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మరో రూ. 141.34 కోట్లు మంజూరైనట్లు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట పరిశుభ్ర పట్టణంగా, దోమలు లేని పట్టణంగా మురుగు కాలువలు లేని పట్టణంగా తీర్చిదిద్దే క్రమంలో సిద్దిపేట వందేళ్ల పునాదిగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. అందుకు 2015లో శ్రీకారం చుట్టామని చెప్పారు. రూ.300 కోట్లతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఈ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సిద్దిపేట పట్టణం పెరిగిన పరిధి, కొత్త కాలనీలు ఏర్పాటు కలిసిన గ్రామాల దృష్ట్యా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మరిన్ని నిధులు కావాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, దీంతో పట్టణాభివృద్ధి మౌలిక సదుపాయాల నిధి ద్వారా సిద్దిపేట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మరో రూ. 141.34 కోట్లు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. దీనితో పట్టణంలో ఏర్పాటైన కాలనీలు, విలీన గ్రామాలు, కొన్ని కాలనీల్లో మిగులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కొత్త కాలనీలకు, విలీన గ్రామాల ప్రజలకు మురుగు కాలువల సమస్య తీరనుందన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ప్రజావాణికి 168 దరఖాస్తులు

- అర్జీలను త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్


సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 168 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు అదనపు కలెక్టర్ హమీద్‌తో కలిసి కలెక్టర్ హైమావతి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. సంబంధిత అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ, ఉపాధి ముఖ్యం

డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ మీటింగ్ కలెక్టర్ కె.హైమావతి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యువతకు ఉద్యోగ ఉపాధి అందించడం కోసం పరిశ్రమలు స్థాపన ముఖ్యమైనదన్నారు. టీజీ-ఐపాస్‌లో వివిధ పరిశ్రమలు నెలకొల్పడానికి దరఖాస్తు పెట్టుకున్న ఆయా విభాగాల వారీగా పరిశీలించాలని చెప్పారు. యూనిట్ నెలకొల్పడానికి సుముఖంగా లేనియెడల డిలీట్ చేయాలని సూచించారు. అలాగే అన్ని పరిశ్రమల్లో కార్మికులకు ఇన్స్యూరెన్స్ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్ రామ్, ఎల్డిఎం హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్






# గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- 20 జీవాలు మృతి.. సుమారు రూ.2.50 లక్షల నష్టం
- కొల్చారంలో దారుణం




ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో మృతిచెందిన గొర్రెలు

కొల్చారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల మందపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ సంఘటన మెదక్ జిల్లా కొల్చారం శివారు మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటకు చెందిన గొర్రెల కాపరి మల్లేశం తన గొర్రెలను మెదక్ వైపు మేతకు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన మెదక్ డిపోకు చెందిన బస్సు ఒక్కసారిగా గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. కళ్లెదుటే గొర్రెలు మృతిచెందడంతో మల్లేష్ బోరున విలపించాడు. సుమారు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు. అయితే సంఘటనా స్థలానికి ఎస్ఐ మొయినుద్దీన్ చేరుకుని ట్రాఫిక్‌ను క్లియ్ చేశాడు. కాగా ఘటన అనంతరం బస్సు డ్రైవర్ బస్సును అక్కడే ఉంచి పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చెరువులో పడి బ్యాంక్ ఉద్యోగి గల్లంతు..

## చెరువులో పడి బ్యాంక్ ఉద్యోగి గల్లంతు

- ప్రమాదమా.. ఆత్మహత్య?




చెరువు వద్ద దొరికిన ఎస్‌బీఐఐడెంటిటీ కార్డు

అల్లాదుర్గం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్ దుబ్బ చెరువులో పడి ఓ బ్యాంక్ ఉద్యోగి గల్లంతయ్యాడు. చెరువు గట్టుపై అతని బైక్, బ్యాంకునకు సంబంధించి ఐడీ కార్డ్ లభించాయి. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంనకు చెందిన ఎన్.నాగచారి(35) సోమవారం రాంపూర్ శివారు దుబ్బ చెరువులో పడటం అటుగా వెళ్తున్న కొందరు గమనించారు. వారు అతనిని రక్షించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా, గట్టుపై ద్విచక్రవాహనం, నగరంలోని గాజుల అన్నారం, శివసాయి హిల్స్ ఎస్‌బీఐ బ్యాంకులో (హన్సిత మేనేజ్‌మెంట్ సర్వీసెస్)లో ఫీల్డ్ ఆఫీసర్‌గా ఐడీ కార్డు లభించింది. సెల్‌ఫోన్ కూడా లభించడంతో అందులో ఉన్న నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే, నాగాచారి ప్రమాదవశాత్తు చెరువులో పడ్డారా? లేక ఆత్మహత్యా చేసుకున్నారా అన్నది తేలడం లేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అశ్రునయనాల మధ్య తల్లీకుమార్తెల అంత్యక్రియలు

మెదక్ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు వద్ద జరిగిన ట్రావెల్ బస్సు ప్రమాద దుర్ఘటనలో సజీవ దహనమైన తల్లీకుమార్తెలు సంధ్యారాణి, చందన అంత్యక్రియలు సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. మెదక్ మండలం శివాయపల్లిలో కుటుంబీకులు, గ్రామస్థులు పెద్దఎత్తున హాజరుకాగా వారికి కన్నీటి వీడ్కోలు పలికారు. శివాయిపల్లికి చెందిన తల్లీకుమార్తె గత గురువారం సాయంత్రం హైదరాబాద్ చింత ప్రాంతంలో బెంగళూరు బస్సు ఎక్కారు. ఈ బస్సు కర్నూలు సమీపంలో ప్రమాదానికి గురి కాగా, 19 మందితో పాటు వీరు సజీవదహనం అయిన విషయం తెలిసిందే. ప్రమాదంలో మృతదేహాల ఆనవాళ్లు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. దీంతో, మృతదేహాలను గుర్తించడానికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. మృతుల బంధువుల నుంచి డీఎన్ఏ శాంపిల్ సేకరించి ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి నిర్ధారించిన అనంతరం మృతదేహాలను ఆదివారం సాయంత్రం అప్పగించారు. మృతదేహాలు అంబులెన్స్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటక గ్రామానికి చేరుకున్నాయి. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి సోమవారం ఉదయం శివాయిపల్లికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



అంతిమయాత్రలో బంధువులు, గ్రామస్థులు

మృతుల కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

గజ్వేల్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన గజ్వేల్ మండలం బూరుగుపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. సానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మినుముల నర్సింలు(35)కు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. ఈనెల 20వ తేదీన ప్రజ్ఞాపూర్ నుంచి ద్విచక్ర వాహనంపై నర్సింలు, వస్తున్న క్రమంలో మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలయ్యాయి, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో సోమవారం నర్సింలు మృతి చెందాడు.

## చెరువులో పడి గుర్తు తెలియని మహిళ..

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో పడి గుర్తు తెలియని ఓ మహిళ మృతిచెందినట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. ఆమె వయస్సు దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల లోపు ఉంటుందన్నారు. గుర్తించిన వారు 8712656718 లేదా 8712539107 నంబర్లకు ఫోన్ చేయాలని సీఐ సూచించారు.

## రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు



ఆవుతో దూడలు

కోహీర్, అక్టోబరు 27 : (ఆంధ్రజ్యోతి) సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం ఒక ఆవు రెండు దూడలకు జన్మనిచ్చింది. బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతు గొల్లకొట్టి కిష్టయ్య చెందిన ఆవు రెండో ఈతలో రెండు కోడెదూడలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆవు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి. రైతు కుటుంబ సభ్యులు సంతోషంలో మునిగిపోయారు. ఈ విషయం గ్రామంలో ప్రజలకు తెలియడంతో తరలివచ్చి వాటిని ఆసక్తిగా తిలకించారు.

## మట్టి అక్రమంగా తరలిస్తున్న వాహనాల పట్టివేత

- రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్
- పోలీసుల అదుపులో ముగ్గురు డ్రైవర్లు



సీజ్ చేసిన టిప్పర్లతో పోలీసులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులో సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) మోడల్ వెంచర్ ప్రభుత్వ భూమి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక హిటాచి బండిని సీజ్ చేసినట్లు సోమవారం త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున దొంగతనంగా కొంతమంది వ్యక్తులు రెండు టిప్పర్లలో హిటాచి ద్వారా మట్టిని నింపుతూ అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు సిద్దిపేట త్రీ టౌన్ ఎస్ఐ మల్లేశం, సిబ్బందితో కలిసి వెళ్లి టిప్పర్ డ్రైవర్లు బోదాస్ నర్సింలు, రేపాక రాజు, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ కోరేం తిరుపతిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారించగా వంగ ప్రవీణ్‌రెడ్డి అనే అతను ఆర్చ్ ఫార్మా పక్కన గల వెంచర్‌లో పోయిస్తున్నాడని చెప్పడంతో రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ కోసం సోమవారం కోర్టు ముందు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

### ఇప్పటికే గ్రామస్థుల ఆందోళన

మిట్టపల్లి చుట్టుపక్కన ఉన్న గుట్టలు ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఇప్పటికే గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఇంత జరుగుతున్నా, పత్రికలలో వార్తలు వస్తున్న కూడా మళ్లీ అదే అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఇందులో అధికారుల చేతివాటం కూడా ఉండి ఉంటుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.















# మక్క..తిక్క

(5వ పేజీ తరువాయి)

ఇతరుల భూమిని కౌలుకు తీసుకొని మక్కలు పండించిన కౌలురైతులకు మార్క్‌ఫెడ్ నిర్ణయాలు కఠినంగా మారాయి. భూమి యజమానులు వచ్చి వేలిముద్ర వేస్తేనే తూకం కోసం బార్‌దాన్ సంచులు ఇస్తామనే నిబంధన కష్టతరంగా మారింది. భూమి యజమానుల్లో కొందరు చనిపోవడం, ఇంకొందరు విదేశాల్లో ఉండడం తదితర కారణాలను కౌలు రైతులు అధిగమించలేకపోతున్నారు. చేసేదేమీ లేక క్వింటాల్‌కు రూ.600 దాకా తక్కువకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ముందస్తుగానే సదరు కౌలురైతు సాగుచేస్తున్న పంట, భూమి యజమాని వివరాలను వ్యవసాయ శాఖ నుంచి తీసుకుంటే ఈ సమస్య వచ్చేదికాదని చెబుతున్నారు.




సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట మొక్కజొన్న రైతులు

### ఎక్కువ పండినా కష్టమే..

ఎకరం భూమిలో 18.50 క్వింటాళ్ల మక్కలు మాత్రమే పండించాలని సంబంధిత మార్క్‌ఫెడ్ అధికారులు విచిత్రమైన నిబంధన పెట్టడం వివాదాస్పదంగా మారింది. ఎకరంలో 30 నుంచి 35క్వింటాళ్ల దాకా మక్కలు పండుతాయని, వేసవిలో 40 క్వింటాళ్ల దాకా పండే అవకాశం ఉంటుందని ఓ సీనియర్ వ్యవసాయ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. కాగా మార్కెట్‌లో మాత్రం 18క్వింటాళ్ల 50 కిలోలకు మాత్రమే బార్‌దాన్ సంచులు ఇస్తున్నారు. ఆపైన పండిన మక్కలను ఇష్టం ఉన్న దగ్గర విక్రయించుకొమ్మని ఉచిత సలహాలు ఇవ్వడం గమనార్హం.

### క్వింటాల్‌కు రూ.600 నష్టం..

మక్కజొన్న రైతులకు క్వింటాల్‌కు రూ.2,400 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. ఆ దిశగా ఆదేశాలు జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో రైతులు రూ.1,800 నుంచి రూ.1,900 వరకు విక్రయిస్తున్నట్లుగా చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ నిర్ణయాలు ప్రతికూలంగా మారడంతో వ్యవసాయ మార్కెట్ల పరిధిలో ఉన్న ప్రైవేట్ వ్యాపారులు ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. రూ.2,400 మద్దతు ధర దక్కాలంటే తేమ శాతం, ఎకరాకు 18.50 క్వింటాళ్ల మక్కలు పండించడం, భూయజమాని వేలిముద్ర నమోదు చేయడం తదితర నిబంధనలు పాటించాలి. ఇవన్నీ అశాస్త్రీయంగా మారడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ అధికారులు దృష్టిసారిస్తే తమ ఇబ్బందులు తొలగుతాయని రైతులు కోరుతున్నారు.



సిద్దిపేట మార్కెట్‌లో మక్కలు

**మొక్కజొన్న పంట వివరాలు**

| జిల్లా | ఎకరాలు | దిగుబడి అంచనా |
|---|---|---|
| సిద్దిపేట | 28,643 | 6.87లక్షల క్వింటాళ్లు |
| సంగారెడ్డి | 7,257 | 1.81 లక్షల క్వింటాళ్లు |
| మెదక్ | 2,576 | 64,400 క్వింటాళ్లు |

# ఆశాలపై పనిభారం

- ఎన్‌సీడీ నమోదు చేయాలని ఒత్తిడి
- సంబంధం లేని పనులతో ఇబ్బందులు
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వేధింపులు ఆపి, నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) ఆన్‌లైన్ నమోదు విధానంపై ఒత్తిడి మానుకోవాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. ఆశాలకు సంబంధం లేని పనులు చేయిస్తూ పని భారం పెంచడాన్ని, కనీస వేతనం అమలు చేయకపోవడాన్ని ఆరోపిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా సుమారు 2000 మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నామని, వాటిని పరిష్కరిస్తామని ప్రస్తుత ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించిందని ఆశా వర్కర్లు ఆరోపిస్తున్నారు. పని భారం ఎక్కువ కావడంతో మానసికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గ్రామాలలో తమకు సంబంధం లేని ఇతర శాఖలకు కూడా పనిచేయాల్సి వస్తోందని, సర్వేల పేరుతో తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆశా వర్కర్ల ప్రధాన డిమాండ్లు

- ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలి.
- ఆశాలకు సంబంధం లేని శాఖల పనులను చేయించవద్దు.
- ఎన్‌సీడీ ఆన్‌లైన్ నమోదు చేయాలని ఒత్తిడి మానుకోవాలి.
- ఇన్సూరెన్స్ సౌకర్యం రూ.50 లక్షలు కల్పించాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్‌ను రూ.5 లక్షలకు పెంచాలి.
- ఎన్ఆర్‌హెచ్ఎం (జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్) స్కీమ్ కింద నిధులను తగ్గిస్తూ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేయాలని చూసే కుట్రలను మానుకోవాలి.
- ఆశాలతో వెట్టి చాకిరి చేయించడం మానుకోవాలి

**సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు**

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు. ఎన్ఆర్‌హెచ్ఎమ్ స్కీం బడ్జెట్లో నిధులను పెంచి ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాలు ఇవ్వాలి. సమస్యలు పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతాం.

– రవికుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు

## తెలుగు పీజీ విద్యార్థులకు ప్రతిభాపురస్కాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు పీజీ విద్యార్థులకు సర్వప్రథమ, ద్వితీయ స్థానాలకు బంగారు పతకాలు, నగదు పురస్కారాలు ప్రదానం చేసారు. డాక్టర్ కేవీ రమణాచారి తండ్రి కేవీ రాఘవాచార్య స్మారకంగా తెలుగు సర్వోన్నత స్థానానికి ఇస్తున్న స్వర్ణ పతకాన్ని కొంగేరి లక్ష్మీ, రంగ త్రిషకు అందజేశారు. బానోజీ సంపత్‌కుమార్ తాత బానోజీ చక్రపాణి స్మారకంగా తెలుగు ద్వితీయ స్థానానికి ఇస్తున్న నగదు పురస్కారాన్ని గొడ్డుగొర్ల అనూజ, వెలిశాల రవళి అందుకున్నారు. ఆధునిక భాష-తెలుగు సర్వప్రథమ స్థానానికి డా.మెట్టు రామశర్మ ఇస్తున్న పురస్కారాన్ని అంబటి పూజిత, పాతూరి ఉదయ్‌కిరణ్‌రెడ్డి అందుకున్నారు. మర్పడగ శ్రీవిజయదుర్గాభవానీ మాత చారిటబుల్ ట్రస్ట్ వారు ఎంఏ తెలుగు సర్వప్రథమ స్థానానికి ఇస్తున్న నగదు పురస్కారాన్ని గడ్డమీద రోహిత్, కామాజీ నవీన అందుకున్నారు. ఈ సంవత్సరం నుండి వేముగంటి రఘునందన్ వారి తండ్రి వేముగంటి నరసింహాచార్య స్మారకంగా ప్రారంభించిన ఎంఏ తెలుగు మొదటి సంవత్సర సర్వప్రథమ పురస్కారాన్ని చెల్పూరి రమ్యకు అందజేశారు. తెలుగుశాఖ అధ్యక్షుడు డా. మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి సమన్వయం చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత తెలుగు రీడరు డా.దాశరథుల బాలయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డా.గూన్ల సునీత, వైస్ ప్రిన్సిపాల్ డా.అయోధ్యరెడ్డి తదితరులు హాజరయ్యారు.

## వ్యాసరచనలో తొగర్‌పల్లి విద్యార్థికి రాష్ట్రస్థాయి తృతీయ బహుమతి

కొండాపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : 'గోవులను పెంచడం, పరిరక్షించడంతో కలిగే ఉపయోగాలు, ప్రయోజనలు' అంశంపై వ్యాసరచన పోటీలో తొగర్‌పల్లి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యూనుస్‌కు రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి అందుకున్నారని ఎంఈవో దశరథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాలు దశరథ్, ఉపాధ్యాయులు యూనుస్‌ను అభినందించారు.

## విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవం

● భక్తులతో కిటకిటలాడిన శంభుగిరి కొండలు



విద్యా సరస్వతీ అమ్మవారు

వర్గల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. మూలానక్షత్రం విద్యా సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం సరస్వతీ అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేడుకల సందర్భంగా ఆలయ యాగశాలలో చండీహోమం చేశారు. ఈ విశేష వేడుకలను తిలకించడానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. విద్యాసరస్వతీ అమ్మవారి దర్శనంతో పాటు క్షేత్రంలోని ఆలయాలైన లక్ష్మీగణపతి, చంద్రమౌళీశ్వరస్వామి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయాలను దర్శించుకున్నారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. వేడుకల సందర్భంగా విద్యాధరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. శంభుగిరి కొండలు భక్తిపారవశ్యమయ్యాయి.

# ఈవీల జోరు

వాతావరణ కాలుష్యం రోజురోజుకూ పెరిగిపోవడానికి పెట్రోల్, డీజిల్ వాహనాలు ప్రధాన కారణంగా మారుతున్నాయి. ఈ వాహనాల నుంచి వెలువడే దట్టమైన పొగ కారణంగా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. కాలుష్యాన్ని సమర్థవంతంగా అరికట్టడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టింది. పెట్రోల్, డీజిల్ వాహనాల సంఖ్యను తగ్గించి, విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది.

- సంగారెడ్డి క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)

ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రజల ఆసక్తి
కొనుగోళ్లకు ప్రభుత్వ ప్రోత్సాహం
లైఫ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు
పెరుగుతున్న వాహనాల సంఖ్య

విద్యుత్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. 2026 డిసెంబర్ వరకు కొనుగోలు చేసే ప్రతి విద్యుత్ వాహనానికి జీవిత కాల పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీలను పూర్తిగా రద్దు చేసింది. పెట్రోల్, డీజిల్ వాహనాలకు వాటి ధరను బట్టి 9 శాతం నుంచి 20 శాతం వరకు జీవితకాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ రాయితీతో కల్పించడం ద్వారా వాహనదారులకు గణనీయమైన లబ్ధి చేకూరుతోంది. ముఖ్యంగా విద్యుత్ కార్ల కొనుగోలుపై లక్షల్లో, ద్విచక్ర వాహనాలపై సుమారు రూ.20 వేల వరకు ఆదా అవుతుందని వినియోగదారులు చెబుతున్నారు.

### పెరుగుతున్న ఈవీల వినియోగం

ప్రభుత్వ రాయితీలు, ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో విద్యుత్ వాహనాల వైపు ప్రజల దృష్టి మళ్లింది. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈవీలకు క్రేజ్ పెరుగుతోంది. జిల్లాలో ఇప్పటికే దాదాపు 2,773 విద్యుత్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. వీటిలో 2,615 ద్విచక్ర వాహనాలే కావడం గమనార్హం. రిజిస్ట్రేషన్ అవసరం లేని (తక్కువ వేగం) ద్విచక్ర వాహనాలు మరో వందల సంఖ్యలో వినియోగంలో ఉన్నాయి. సంగారెడ్డి, పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్ వంటి పట్టణాల్లో ఈవీల వినియోగం అధికంగా ఉంది. టీవీఎస్, ఓలా, చేతక్, హీరో, ప్యూర్ తదితర కంపెనీల వాహనాలు రూ.40 వేల నుంచి రూ.1.90 లక్షల వరకు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. పెట్రోల్, డీజిల్ కోసం పెరుగుతున్న ఖర్చు ఈవీల వాడకం వల్ల తగ్గుతోందని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం తగ్గి, పర్యావరణం పరిరక్షించబడుతుందని, పైగా నిర్వహణ, రిపేర్లు కూడా తక్కువగా ఉంటాయని వినియోగదారులు చెబుతున్నారు.





సంగారెడ్డి జిల్లాలో విద్యుత్ వాహనాల సంఖ్య

| | |
|---|---|
| ద్విచక్ర వాహనాలు | 2,615 |
| ఆటో రిక్షాలు | 49 |
| కార్లు | 109 |



గతంలో పెట్రోల్ కోసం ప్రతి మూడు రోజులకోసారి డబ్బు నీళ్లలా ఖర్చు చేసేవాణ్ణి. ఏడు నెలల క్రితం ప్యూర్ ఈవీ ద్విచక్ర వాహనం కొన్నాను. ఇప్పుడు రాత్రి చార్జ్ చేసి ఉదయం నుంచి రాత్రి వరకు నడిపిస్తున్నా, డబ్బు బాగా ఆదా అవుతోంది. శబ్దం కూడా లేకుండా ప్రయాణం హాయిగా ఉంది. మధ్యతరగతి ప్రజలకు ఈవీ వాహనం ఎంతో ఉపయోగకరం ఉంటుంది.

- వెన్న చక్రేశ్వర్, ఉపాధ్యాయుడు, సంగారెడ్డి

# దళారులను నమ్మి మోసపోవద్దు

● మోదీ హయాంలో గణనీయంగా పెరిగిన పత్తి మద్దతు ధర

● ఎంపీ రఘునందన్‌రావు

కొండపాక/దౌల్తాబాద్/తొగుట/గజ్వేల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో పత్తి మద్దతు ధరలు గణనీయంగా పెరిగాయని, రైతులు తమ పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధి పొందాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు సూచించారు. సోమవారం ఆయన గజ్వేల్ మండలం పిడిచెడ్‌లోని సాయిబాలాజీ కాటన్ మిల్లు, కొండపాక మండలం ఆరేపల్లిలోని స్వాతి జిన్నింగ్ మిల్లు, తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలోని శ్రీవెంకటేశ్వర కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లు, దౌల్తాబాద్ మండలం హైమద్ నగర్‌లోని తిరుమల కాటన్ మిల్లుల్లో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2014తో పోలిస్తే పత్తి మద్దతు ధర రెట్టింపు అయిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్వింటాలుకు మొదటి రకం పత్తికి రూ.8110, రెండో రకానికి రూ.8060, మూడో రకానికి రూ.8010 చెల్లిస్తారని తెలిపారు. తేమ శాతం పేరుతో, నాణ్యత పేరిట రైతులను ఇబ్బంది పెట్టవద్దని, దళారీ వ్యవస్థను ప్రోత్సహించే చర్యలు మానుకోవాలని మిల్లు యజమానులను, అధికారులను ఆదేశించారు. ఎవరైనా దళారులు రైతులను మోసం చేయాలని ప్రయత్నిస్తే వెంటనే తనకు ఫోన్ చేయాలని ఎంపీ రఘునందన్‌రావు రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అధికారుల ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని, రైతులు ఫోన్ చేస్తే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దళారులతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులు పెట్టే అధికారులు ఏవరైనా ఉంటే లీవ్ పెట్టి ఇంటికి వెళ్లిపోవాలని, రైతులను మోసం చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పత్తిలో తేమశాతం పరీక్షించే పరికరాలు అందుబాటులో ఉంచాలని, మార్కెట్ యార్డులలో సరిపడా యంత్రాలు, పరికరాలు, సిబ్బంది ఉండేలా చూడాలన్నారు. గజ్వేల్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, తొగుటలో మార్కెటింగ్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు, దుబ్బాక ఆత్మ కమిటీ ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కొండపాకలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



హైమద్‌నగర్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ పార్టీ నాయకులు

## తేమ పరీక్షా పరికరాల్లో తేడాలు

చిలప్‌చెడ్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం తేమను పరిశీలించే పరికరాల్లో తేడాలను కనుగొన్న సంఘటన సోమవారం మండలం పరిధిలోని గంగారం గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఓ రైతు తన ధాన్యం తేమను (మ్యాచర్) పరికరం సహాయంతో పరిశీలించగా తేమ 15 శాతం ఉన్నట్లుగా చూయించింది. అనుమానం వచ్చిన ఆ రైతు పక్కనే ఉన్న అజ్జమర్రి గ్రామంలో పీఏసీఎస్ వారు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఉపయోగించే పరికరంతో అదే ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించగా 12.4 ఉన్నట్లుగా చూయించింది. ఇలా రెండు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పరికరాల్లో తేడాలు రావడం పట్ల రైతులు మండిపడ్డారు. తప్పుగా చూపించడం వల్ల నష్టపోయేది తామేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వరకు కూడా ఎన్ని మార్లు తాము మోసపోయామో అంటూ వాపోతున్నారు. ఇకనైనా నిర్వాహకులు సరైన పరికరాన్ని ఉపయోగించాలని, రైతులను మోసగించవద్దని వారు కోరుతున్నారు.





ధాన్యం తేమ పరీక్ష చేసే పరికాల్లో చూపిస్తున్న తేడా



మైదానానికి తీసుకువస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి మంగళహారతి పడుతున్న మహిళలు

# కనులపండువగా కల్యాణం

నారాయణఖేడ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): లలితాదేవి వైభవం ట్రస్టు తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవస్థాపకుడు మలమంచి మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నారాయణఖేడ్‌లోని తహసీల్ మైదానంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణంతో పాటు లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. కార్తీకమాస విశిష్టతను, ధర్మ కార్యాల గొప్పతనాన్ని, మానవసేవ ప్రాధాన్యంను వివరించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్, పెద్దఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



మాధవానందసరస్వతీ స్వామి సమక్షంలో కల్యాణం

# మర్పడగ క్షేత్రం.. వార్షిక వైభవం

● నేటి నుంచి విజయదుర్గామాత ఆలయంలో ఉత్సవాలు

● అమ్మవారికి స్వర్ణ కిరీటం సమర్పణ

● భక్తుల నుంచి సేకరించిన రూ.2 కోట్ల విరాళాలతో తయారీ

కొండపాక, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ గ్రామంలో దినదినం ప్రవర్ధమానంగా విరాజిల్లుతున్న శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రం, విజయదుర్గామాత ఆలయ వార్షికోత్సవాలు అక్టోబరు 28, మంగళవారం ప్రారంభమై రెండు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తులు విరాళంగా సమకూర్చిన స్వర్ణ కిరీట సమర్పణ కార్యక్రమం బుధవారం అత్యంత అట్టహాసంగా జరగనుంది.

### ఆధ్యాత్మిక కేంద్రంగా...

విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రం సిద్దిపేట జిల్లా కేంద్రానికి సమీపంలో మర్పడగ గ్రామంలో ఉన్నది. దేవి ఉపాసకులు డా. చెప్పేల హరినాథశర్మ ఆధ్వర్యంలో స్థాపితమైంది. ఇక్కడ నిత్యం జరిగే పూజలు, శ్రద్ధాభక్తులతో కోరిన కోర్కెలు తీరుతున్నాయని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ప్రత్యేకించి, నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి, వివాహం కానివారికి వివాహ సాఫల్యం, సంతానం లేనివారికి సంతానప్రాప్తి కలుగుతాయని భక్తుల నమ్మకం. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు ఈ దేవాలయంపై ఎంతో విశ్వాసం ఉంది. ఆయన సతీమణి ప్రతీ సంవత్సరం దేవీనవరాత్రి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు. 2006లో ఈ క్షేత్రంలో సహస్ర చండీయాగం నిర్వహించారు. ఆ సమయంలోనే వెదురుపాక పీఠాధిపతి వెదురుపాక గాడ్ ఆధ్వర్యంలో విజయదుర్గామాత ఆలయానికి శంకుస్థాపన జరిగింది. 2009 అక్టోబరు 25న అమ్మవారి ప్రతిష్ఠా కార్యక్రమాలు జరిగాయి.





మర్పడగలోని విజయదుర్గామాత ఆలయం, శంకర విజయేంద్రసరస్వతిస్వామికి చూపిస్తున్న కిరీటం నమూనా

### 29న స్వర్ణ కిరీట సమర్పణ

ఈ నెల 29న అమ్మవారికి స్వర్ణ కిరీట సమర్పణ కార్యక్రమం వైభవంగా జరగనుంది. సుమారు 1600 మంది దాతలు ఒక్కో గ్రాము చొప్పున బంగారాన్ని విరాళంగా ఇవ్వగా, సుమారు రెండు కోట్ల రూపాయల విలువైన ఈ స్వర్ణ కిరీటాన్ని హైదరాబాద్‌లో తయారు చేయించారు. తయారీకి దాదాపు ఆరు నెలల సమయం పట్టింది. ఈ మహోత్సవంలో మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు స్వయంగా పాల్గొని అమ్మవారికి స్వర్ణ కిరీటాన్ని సమర్పించనున్నారు.

### ప్రత్యేక పూజల విశేషాలు

శ్రీవిజయదుర్గ సమేత సంతాన మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రతి నెలా ప్రత్యేక పూజలు జరుగుతాయి. ప్రతీ మంగళవారం రోజున ఆర్ద్ర మహోత్సవం, శుక్రవారం అమ్మవారికి పంచామృత ఫలరసాభిషేకం, రాహుకాల పూజలు, దుర్గాపూజ, కాలసర్పదోష నివారణ, వివాహ ప్రతిబంధక దోష నివారణ, అష్టనాగపూజ నిర్వహిస్తారు. అనేకమంది ప్రముఖులు ఈ దేవాలయాన్ని దర్శించుకున్నారు.

### భక్తులకు సౌకర్యాలు

ఈ ఆలయం సిద్దిపేట నుంచి కేవలం 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట బస్టాండ్ నుంచి ఆటో లేదా బస్సు ద్వారా చేరుకోవచ్చు. దుద్దెడ టోల్‌గేట్ పక్కన ఉన్న రోడ్డులో తొగుటకు వెళ్లే రహదారి ద్వారా జప్తి నాచారం మీదుగా కేవలం 6 కిలోమీటర్ల దూరంలోని ఆలయానికి చేరుకోవచ్చు. వార్షికోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చలువ పందిళ్లు వేయడంతో పాటు ఆలయాన్ని రంగులతో అలంకరించారు. వచ్చే భక్తులకు భోజన వసతి కల్పించడానికి అన్నీ సిద్ధం చేశారు.



నాచగిరి క్షేత్రంలో దీపాలు

# ఆలయాల్లో కార్తీక శోభ

ఝరాసంగం/వర్గల్, అక్టోబరు 27 : ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో, వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం సోమవారం కార్తీక శోభను సంతరించుకున్నాయి. కేతకీ ఆలయ ఆవరణలో మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మొదట ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈవో శివరుద్రప్ప భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పరిసరాలను పర్యవేక్షించారు. నాచగిరి క్షేత్రంలో వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా దంపతులు మహిళ భక్తులకు తాంబూలం పంపిణీ చేశారు. అనంతరం గౌరీభట్ల సోమనాథశర్మ సిద్ధాంతి భక్తులకు కార్తీక మాస విశిష్టతను వివరించారు.



కేతకీ సంగమేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హుస్నాబాద్‌రూరల్/దుబ్బాక/సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో శవ యాత్రను నిర్వహించి నిరసన తెలియజేశారు. స్థానిక కోర్టు చౌరస్తా నుంచి శివాజీ కూడలి వరకు శవయాత్ర నిర్వహించి ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పెండింగ్‌లో ఉన్న 8500 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేస్తామని గొప్పలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్, ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు గడుస్తున్నా కనీసం రాష్ట్రంలో విద్యాశాఖకు విద్యాశాఖ మంత్రి నియమించకపోవడం దారుణమన్నారు. విద్యాశాఖను స్వయంగా తానే చూస్తున్నాను అని గొప్పలు చెప్పుకునే సీఎం పేద, మధ్యతరగతి విద్యార్థులు కనబడడం లేదా అని ప్రశ్నించారు.

**దుబ్బాకలో**

ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ పూర్తి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, సోమవారం దుబ్బాకలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లెల్ల ఫణిందర్ మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరి కారణంగా రెండేళ్లుగా కాంగ్రెస్ పాలనలో రెండు సార్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని బంద్‌కు పిలుపునిచ్చారన్నారు.




దుబ్బాకలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ

**హుస్నాబాద్‌రూరల్**

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హుస్నాబాద్ పట్టణంలో ఏబీవీపీ కార్యకర్తలు వినూత్నంగా దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంసాని రాకేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఫీజురియాంబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర బడ్జెట్‌లో దసరాకు రూ. 600 కోట్లు, దీపావళికి మరో రూ. 600 కోట్లు విడదల చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఉప్పటికి ఒక్క రూపాయికూడా చెల్లించలేదన్నారు. ఇప్పటికే విద్యార్థులు రోడ్లపైకి వచ్చి అడుక్కునే దుస్థితి ఏర్పడిందని విమర్శించారు.




హుస్నాబాద్‌లో దున్నపోతుకు వినతి పత్రం ఇస్తున్న ఏబీవిపి కార్యకర్తలు

## అందె గ్రామానికి బస్సు నడపాలంటూ..

● గ్రామస్థుల నిరసన



అందె గ్రామానికి బస్సును నడపాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

సిద్దిపేట, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): అందె గ్రామానికి ఆర్టీ సీ బస్సును నడిపించాలంటూ సోమవారం మిరుదొడ్డి మండలం అందె స్టేజీ వద్ద గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. అందె గ్రామానికి బస్సురాకపోవడం ద్వారా విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా అందెస్టేజీ గ్రామంలోకి బస్సును నడిపించాలని కోరారు. లేనియెడల గ్రామస్థులు ఏకమై పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈవిషయంపై ఆర్‌టీసీ ఉన్నతాధికారుల స్పందించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు లింగం,ప్రవీన్ తదితరులు ఉన్నారు.

## ఆపరేటర్ లేక నిలిచిన రిజిస్ట్రేషన్స్

మద్దూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులు ఆపరేటర్ మీటింగ్‌కు వెళ్లినట్లు కార్యాలయ అధికారుల ద్వారా తెలుసుకున్న రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. పలువురు రైతులు భూ భారతిలో స్లాట్ బుక్ చేసుకున్నారు. సోమవారం రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులకు తహసీల్దారు ఆపరేటర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీటింగ్‌కు వెళ్లారని మరుసటి రోజు రావాలని తిప్పి పంపారు. ఎంతో దూర ప్రాంతం నుంచి వచ్చిన రైతులకు ఆపరేటర్ లేడన్న విషయంతో ఉసూరు మంటూ వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆపరేటర్ రాకున్నా, తహసీల్దారు ఏదేని పని మీద వెళ్లినా రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తహసిల్దార్ల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను డిప్యూటీ తహసిల్దార్లకు అప్పగించి రిజిస్ట్రేషన్లలో జాప్యం లేకుండా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

## చెరువును పరిశీలించిన ఐబీ అధికారులు



నల్లపోచమ్మ చెరువు ఎఫ్‌టీఎల్ పరిశీలిస్తున్న ఐబీ అధికారులు

చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొండపోచమ్మ దేవాలయ సమీపంలోని చేర్యాల మండలం నాగపురి పరిధిలోని నల్లపోచమ్మ చెరువును సోమవారం ఐబీ అధికారులు పరిశీలించారు. అక్రమ నిర్మాణాలతో చెరువు ఎఫ్‌టీఎల్ అన్యాక్రాంతానికి గురైందని పేర్కొంటూ నల్లపోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ గూడెపు మహేశ్ తదితరులు నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సంబంధితశాఖ ఈఈ కవిత, డీఈఈ శ్యాం కలిసి చెరువును, ఎఫ్‌టీఎల్‌ను పరిశీలించారు. పూర్తిస్థాయి వివరాలు పరిశీలించి ప్రత్యామ్నాయచర్యలు తీసుకుం టామని, అన్యాక్రాంతానికి గురికాకుండా చెరువు సంరక్షణకు పాటుపడతామని హామీ ఇచ్చారు.ఈసందర్భంగా గూడెపుమహేశ్ తదితరులున్నారు.

### కిసాన్ కపాస్ స్లాట్ బుకింగ్‌పై రైతులకు అవగాహన

మద్దూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు కిసాన్ కపాస్ యాప్ ద్వారా మాత్రమే పత్తి విక్రయాలు చేట్టాలని మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్ బుకింగ్ ఏ విధంగా చేసుకోవాలనే సందేహాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడారు. రైతులు పండించిన పత్తి పంట విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందస్తుగా రైతులకు యాప్‌పై పూర్తి అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులు పలు సందేహాలకు నివృత్తి చేసుకున్నారు. యాప్ వాడకంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించాలని సూచించినట్లు తెలిపారు.

## కళాశాలలో పోస్టర్ ప్రజెంటేషన్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వాణిజశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. టాప్ 50 నిఫ్టీ కంపెనీలలో 33 కంపెనీల గురించి విద్యార్థులు పోస్టర్లు రూపొందించి వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జీవన్ కుమార్ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులకు వ్యాపారం గురించి, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో టాప్ కంపెనీల గురించి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన విద్యార్థులను ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, కోఆర్డినేటర్ డాక్టర్ స్రవంతి, వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి హరిప్రసాద్, తిరుపతి, అనిరుద్ అధ్యాపక అధ్యాపక ఇతర బృందం పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై అవగాహన

మద్దూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాను నవీకరించడంతో పాటు సరిచేయడానికి బీఎల్‌వో, బీఎల్‌వో సూపర్ వైజర్లతో పాటు జీపీవోలకు అవగాహన కల్పించినట్లు తహసిల్దారు ఏజీ రహీం తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దారు మాట్లాడారు. 2002వ సంవత్సరపు ఓటరు జాబితాలోని ఓటర్లను 2025వ సంవత్సరపు ఓటర్ల జాబితాలోని వారి వారసులతో సరిపోల్చడం చేయుటకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ ముస్తాక్ అన్వర్ , బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, జీపీవోలు పాల్గొన్నారు.

## శ్రమదానం చేసిన యువత



గాంధీనగర్‌లో శ్రమదానంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్ల పొదలను తొలగిస్తున్న యూత్ సభ్యులు

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం గాంధీనగర్‌లో రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్ల పొదలను శ్రమదానంతో తొలగించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. గామాభివృద్ధిలో గ్రామ యువకులందరం స్వచ్ఛందంగా పాల్గొని మాగ్రామాన్ని మేమే అభివృద్ధి చేసుకుంటామన్న దృఢసంకల్పంతో ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. జీబీడీసీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేసేందుకు యువత సంఘటితంగా పనిచేస్తామని ప్రకటించారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి రూ.పది వేల జరిమానా

సిద్దిపేట క్రైం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలసి కొన్ని రోజుల క్రితం నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఏడుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొన్నారు. వారిని సిద్దిపేట అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. తరుణి ముందు హాజరుపరచగా విచారణ చేసి ఏడుగురికి రూ.70,000 జరిమాన విధించారు.

### స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గజ్వేల్ రూరల్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): కుకునూరు పల్లి ఉన్నత పాఠశాల స్నేహితులు తమ బాల్య స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందచేశారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి ఎన్నెల్లి కిషన్ ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకుని 2008-09 బ్యాచ్ కుకునూరు పల్లి ఉన్నత పాఠశాల స్నేహితులు అందరూ కలిసి సోమవారం 20000 రూపాయలు కిషన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

### మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం అని బీజేపీ బూత్ అధ్యకుడు గుండారం నవీన్ అన్నారు. ఆత్మహత్య చేసుకున్న కిషన్ కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సహాయం చేశారు.

## ప్రజా సమస్యలపై అవగాహన

కోహెడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న చిన్న చిన్న తగాదాలపై గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని ఎస్సై పి. అభిలాష్ అన్నారు. సోమవారం కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో ప్రజా సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గల సమస్యలు వాటిని ఎలా పరిష్కారం చేసుకోవాలి అని, పరిష్కరించగలిగే సమస్యలు ఉంటే ఇక్కడికిక్కడే పరిష్కారం చేస్తామని చెప్పారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## మర్కూక్ ఎంపీడీవోగా విక్రమ్



ఎంపీడీవో విక్రమ్

మర్కుక్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల నూతన ఎంపీడీవోగా విక్రమ్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని మండల అధికారుల సహకారంతో మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలుపుతానని అన్నారు. ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాలలో ఉద్యోగం సాధించి మొట్ట మొదటిసారిగా ఎంపీడీవోగా బాధ్యలు స్వీకరించడం సంతోషంగా ఉందని అన్నారు.

## రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలి

● మాజీ ఉపసర్పంచ్ కనకయ్య

కుకునూరుపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల రోడ్డు వద్ద పద్ధతి చర్యలు చేపట్టాలని మంగోల్ మాజీ ఉపసర్పంచ్ కనకయ్య అన్నారు. సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేసిన మంగోల్ మాజీ ఉపసర్పంచ్ కనకయ్య ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15రోజుల క్రితం రోడ్డుకు కుకునూరుపల్లి గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న మల్లం మేఘన రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు భయం భయంగా రోడ్డును దాటుతున్నారని హెచ్‌కెఆర్ యాజమాన్యం ఈ విషయంపై భద్రతా చర్యలు తీసుకోవాలని పలుమార్లు వారికి విన్నవించినప్పటికీ చర్యలు లేవని ఇప్పటికైనా ప్రమాదాలను నివారించే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం

● బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



జూబ్లీహిల్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో విజయం బీఆర్ఎస్ పార్టీదేనని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలసి జూబ్లీహిల్స్ పరిధిలోని పలు బూత్‌లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం



చేర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ ఎల్.శ్రీను

చేర్యాల/హుస్నాబాద్‌రూరల్/గజ్వేల్/కొమురవెల్లి/సిద్దిపేట క్రైం అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి అన్నారు.

## అపరిచితుల మాటలు నమ్మవద్దు

గజ్వేల్/సిద్దిపేట రూరల్,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ కానీ మాటలు నమ్మవద్దని సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ కె.రాజేష్, గజ్వేల్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మురళి విద్యార్థులకు సూచించారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ప్రభుత్వ ఐటీఐ కళశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, చట్టాలు, డ్రగ్స్‌గంజాయి వంటివాటి పై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యాధునిక పరికరాలతో విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో శిక్షణ అందిస్తుందని, శిక్షణ పూర్తి అయిన వెంటనే నేరుగా ఉపాధి పనులు చేసుకునేందుకు విలుగా శిక్షణ అందిస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవలన్నారు. అదే విధంగా మహిళ భద్రతకుఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. చదువుకునే సమయంలో చేడు అలావాట్లకు భానిస కావద్దని,ప్రతి ఒక్కరూ చదువు పై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్ మరియు గంజాయి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

## మహిళా సంఘ సభ్యులకు ముగ్గుల పోటీలు



వర్గల్ గ్రామపంచాయతీ వద్ద సెర్ప్, ఐడీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగోలి కార్యక్రమం

సిద్దిపేట అర్బన్ /రాయపోల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌లో, సిద్దిపేట అర్బన్‌లో సోమవారం సోమవారం మహిళా సంఘ సభ్యులకు డ్రగ్స్ మాదక ద్రవ్యాల నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రంగోలి పోటీలు నిర్వహించగా మహిళలు రకరకాల రంగులతో ఆరోగ్యంకరమైన ఆహారం తినడం, పొగత్రాగడం వలన జరిగే అనర్థాలు, యోగా, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు వంటి చిత్రాలను వేశారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

## చేర్యాల ఎంపీడీవోగా అనభేరి ప్రణయ్

చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి) : చేర్యాల ఎంపీడీవోగా అనభేరి ప్రణయ్ నియామకమయ్యారు. కరీంనగర్ జిల్లాకు చెందిన అనభేరి ప్రణయ్ ఇటీవల గ్రూప్-1లో కొలువు సాధించారు. కొద్ది రోజులుగా చేర్యాల ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉండగా, కిందిస్థాయి ఉద్యోగులు ఇంచార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈక్రమంలో అనభేరి ప్రణయ్‌ను ఎంపీడీవోగా నియమించడంతో సోమవారం ఆయన కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించి విధులలోకి చేరారు. కొన్నాళ్లుగా ఎంపీవో మహబూబ్ అలీ ఇంచార్జి ఎంపీడీవో బాధ్యతలు చేపట్టగా, ఇటీవల సస్పెన్షన్‌కు గురవడంతో ఆయన స్థానంలో సుధాకర్‌ను నియమించడంతో పాటు సీనియర్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జి ఎంపీవోగా నియమించారు.

## నల్ల పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన



కార్యక్రమానికి హాజరైన తాజా మాజీ ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని మాల కమ్యూనిటీ ఆధ్వర్యంలో వెలసిన నల్ల పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమానికి తాజా మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి దయతో అందరూ బాగుండాలని తెలిపారు.

## ఇంటర్ విద్యలో గుణాత్మక మార్పులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వం గుణాత్మక మార్పులు తీసుకువస్తుందని ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మరమ్మత్తులు, నిర్వహణకు నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో సోమవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి (డిఐఈఓ) రవీందర్ రెడ్డితో కలిసి ప్రిన్సిపల్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని అందులో భాగంగా ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ఏసీపీ సదానందం

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పిలుపునిచ్చారు. సోమవారం హుస్నాబాద్‌లో ఏసీపీ పలువురికి ట్రాఫిక్, రోడ్డు నియమనింబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్లపై ధాన్యం పోయకూడదని రైతులకు సూచించారు. రోడ్లకు ఇరువైపుల ధాన్యం రాసుల కుప్పలు పోయడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకుండా రోడ్డుపైన ధాన్యం పోయడం ఎంతో ప్రమాదకరమైన సంఘటన అన్నారు. ఎక్కడైతే రోడ్డు నియమ నిబంధనలు పాటించకుండా తమ ఇష్టాను సారంగా వ్యహరిస్తే ప్రమాదాలు జరిగినప్పుడు సదరు రైతు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు

## పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రధాన అతిథిగా కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వంగాల శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు లక్ష్యసాధన కోసం సమయపాలన, ప్రణాళిక, క్రమశిక్షణ ఎంత ముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు, యూపిఎస్‌సి, టీజిపిఎస్‌సి, బ్యాంక్, ఎస్ ఎస్‌సి ఇతర పోటీ పరీక్షల గురించి సమాచారం అందిచారు. అదేవిధంగా విజయవంతమైన అభ్యర్థుల అనుభవాలను పంచుకున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి అయోధ్య రెడ్డి మాట్లాడుతూ యువత ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఆకునూరులో దెయ్యం...భయం

చేర్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామశివారులో దెయ్యం సంచరిస్తుందంటూ వదంతులు వినవస్తున్నాయి.ఈ నేపథ్యంలో స్థానికులు ఓ వీడియోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడం కలకలం రేపింది. గ్రామంలో ఎవరు చనిపోయినా వాగు సమీ పంలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం వాగులోనుండి ఇసుక తవ్వకం చేస్తున్నారు. ఈక్రమంలో సాయంత్రంవేళ వాగు బ్రిడ్జిపై దెయ్యం మాదిరి కదలికలు కనిపించాయని కొందరు వీడియో తీసి వాట్సప్ గ్రూప్‌లలో పోస్ట్ చేశారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈవిషయం ఆ నోటా ఈనోటా వ్యాపించ డంతో కలకలం రేపింది.

**వదంతులు నమ్మవద్దు : ఎల్.శ్రీను చేర్యాల సీఐ**


దయ్యాలు సంచరిస్తున్నాయన్న వదంతులు ప్రజలు నమ్మవద్దు. మూఢనమ్మకాలు, అపోహలు వీడాలి. ప్రజల్లో భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం పట్ల విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట/మద్దూరు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్గల్ ఎమ్మెల్సీ యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వర్గల్ మండల కేంద్రంతో పాటు పాటు అంబర్‌పేట, వేలూర్, తునికిఖాల్సా గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్‌తో కలిసి ప్రారంభించారు. మద్దూరు మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 3, సొసైటీ ఆధ్వర్యంలో 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందనిమండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ తెలిపారు

# లక్కు.. కిక్కు!

(5వ పేజీ తరువాయి)




ఈ క్రమంలో 93 మద్యం దుకాణాలలో 20 దుకాణాలను మహిళలు దక్కించుకున్నారు.

**డిసెంబర్ 1నుంచి కొత్త దుకాణాలు ప్రారంభం**

లక్కీ డ్రాలో మద్యం షాపులను గెలుచుకున్న వ్యాపారవేత్తలు నేటి సాయంత్రంలోగా షాపునకు సంబంధించిన లైసెన్సు రుసుములో 1/6 వంతు చెల్లించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మూర్తి తెలిపారు. డిసెంబర్ ఒకటవ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలను ప్రారంభించుకోవచ్చని సూచించారు.

## డీసీసీబీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● సీఈవో ఎన్. సత్యనారాయణరావు

కోహెడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెంట్రల్ బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ డీసీసీబీ సీఈఓ ఎన్ సత్యనారాయణరావు అన్నారు .సోమవారం కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం కోహెడ మండల కేంద్రంకు ఈ బ్యాంకు మంజూరు కావడం జరిగిందన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఉన్న ఈ మండలం మెదక్ ఉమ్మడి జిల్లాకు బదిలీ కావడంతో సాంకేతిక సమస్యలు ఆర్బీఐ వద్ద ఉత్పన్నం కావడంతో బ్యాంకు ఏర్పాటుకు ఆలస్యం అయిందన్నారు.